క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు

దామెర: మండలంలోని ఊరుగొండలో బెల్టు షాపు నిర్వహిస్తు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏ. మధుసూదన్, పీ. రమేష్, లవణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన చెమ్మల రాజేందర్, గొంది జయపాల్‌రెడ్డి అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా రూ. 4,730 విలువ చేసే మద్యం లభించిందని తెలిపారు. మద్యాన్ని స్వాదినం చేసుకొని ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

11న విశ్వరూప మహాసభ

కాజీపేట రూరల్: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 11న జరగనున్న ఎస్సీల వర్గీకరణ మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ కోరారు. కాజీపేట బాపూజీనగర్‌లో ఎమ్మెస్పీ జిల్లా నాయకుడు బండారి సురేందర్ అధ్యక్షతన శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటా బీఆర్‌ఎస్ ప్రచారం



శాయంపేట : మండలంలోని పత్తిపాక, మైలారం గ్రామాల్లో సర్పంచ్‌లు చిట్టిరెడ్డి రాజిరెడ్డి, అరికిల్ల ప్రసాద్ శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, తిరుపతి, కిరణ్, సమ్మయ్య, మోహన్ రెడ్డి, ఐలయ్య, శంకర్, భాస్కర్, దిలీప్, రాంరెడ్డి, కుమారస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



శాయంపేట : ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో చేపడుతున్న తెలంగాణ విశ్వబ్రాహ్మణ మహాజన సభ పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వినుకొండ శంకరాచారి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ మహాసభకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం 8గంటలకు హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని విశ్వబ్రాహ్మణులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వంగాల పరమేశ్వర్, సభ్యులు రామగిరి రమేష్, శ్రీరామోజు ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఈఏఎస్ సెంటర్ సందర్శన



నడికూడ: మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామార్థ్యాలను తెలుసుకునేందుకు నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ అచివ్మెంట్ సర్వే పరీక్ష విధానాన్ని శుక్రవారం బ్లాక్ లెవెల్ కోఆర్డినేటర్ హనుమంతురావు పరిశీలించారు. సెంటర్ నిర్వహణ తీరు, పరీక్ష విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ మైతిలి, సీఆర్పీ రఘుపతి, ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్, నిగ్గుల శ్రీదేవి పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యా విభాగం (ఎడ్యుకేషన్) పరిశోధకుడు వెంకటేశ్వర్లు భూక్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆఫ్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ వాల్యూస్ అండ్ వాల్యూ ఓరియంటేషన్ అమాంగ్ టీచర్స్ ఆఫ్ ట్రైబల్ కమ్యూనిటీస్ ఇన్ ప్రైమరీ అండ్ సెకండరీ స్కూల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వెంకటేశ్వర్లు భూక్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు.

డాక్టరేట్ గ్రహీత రఘుకు సన్మానం

కాజీపేట రూరల్ / హన్మకొండ అర్బన్: ఓయు డాక్టరేట్ గ్రహీత సల్ల రఘును మాల మహానాడు, అంబేడ్కర్ సంఘాల నాయకులు కాజీపేట దర్గా అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం సన్మానించారు. మాల మహానాడు గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

● ఏసీపీ కిశోర్ కుమార్



నడికూడ : మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్ కుమార్



దామెర : అవగాహన కల్పిస్తున్న ఏసీపీ కిశోర్ కుమార్

నడికూడ: రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు ప్రతిఒక్కరూ సహకరించాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మారంలో శుక్రవారం పరకాల పోలీస్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు సమన్వయంతో ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అనంతరం ఏపీఓ సయ్యద్ అఫ్జల్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ జరిగే రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. సీఐ వెంకటరత్నం, ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

దామెర: ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని పసరగొండలో శుక్రవారం పోలీస్ కళాబృందం సభ్యులు కళాజాత నిర్వహించారు. అనంతరం ఏసీపీ మాట్లాడారు. అనవసరమైన గొడవల్లో తలదూర్చి కేసుల పాలు కావద్దన్నారు. యువత వ్యసనాల బారినపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవ్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై ముత్యం రాజేందర్, పోలీస్ కళాబృందం సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

దామెర: జాతీయ ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. డీఆర్డీఓ శ్రీనివాసకుమార్ సమావేశానికి అధ్యక్షత వహించగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను 219 పనుల్లో రూ. 2,39,00000 ఖర్చుకు సంబంధించిన వివరాలపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం సభ్యులు పలు సందేహాలు లేవనెత్తగా పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది సమాధానం తెలిపారు. కాగా సీతారాంపూర్, ఊరుగొండ గ్రామాలకు సంబంధించిన పనుల విషయమై రూ. 1,273 జరిమాన విధించారు. అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, అబుష్మాన్ నాగరాజు, విజిలెన్స్ అధికారి నర్సింహారెడ్డి, ఎస్‌టీఎం వేణు, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ రంగాచారి, ఎస్ఆర్పీ సుధాకర్, పీర్ ఏఈ లత, ఏపీఎం ఝాన్సీ పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజయ్య

హసన్‌పర్తి: దివ్యాంగుల సేవా సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన గొల్లే రాజయ్య నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి శుక్రవారం ప్రకటించారు. ఈమేరకు నియామకం పత్రం అందజేశారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని హంటర్‌రోడ్డులోని ఎస్సీ (సీ) బాయ్స్ హాస్టల్‌లోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి భాగ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మచ్చ పవన్ తెలిపారు. హాస్టల్‌కు మహిళా వార్డెన్ ఉండటం వలన విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈక్రమంలో పురుష వార్డెన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ బాధ్యులు శ్రీకాంత్, వినయ్, రవికిరణ్, ప్రసాద్, రఘుకృష్ణ, మురళి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంపై అభ్యంతరాలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ 49వ డివిజన్ పరిధిలోని రెవెన్యూకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం వివాదానికి దారితీసింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన స్థానిక కార్పొరేటర్ ఈ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్అండ్‌బీ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారు కూడా తమకు ఆ పనితో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అయితే ఎన్నికల సమయంలో రూ.3 లక్షల సొంత ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ శివారు దూపకుంటలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలు గురువారం పరిశీలించినట్లు తెలిసింది. రంగులతో తీర్చిదిద్దిన డబుల్ బెడ్రూం ఇళ్లను చూసి వారు మురిసిపోయారు. 'ఇవేనా మాకు ఇచ్చే ఇళ్లు' అంటూ పెరకవాడకు చెందిన ఇల్లు లేని నిరుపేద మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే, అధికార పార్టీ ఎమ్మెల్యే గెలుస్తే ఇల్లు లేని వారికి ఇచ్చే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవేనని అక్కడి చేరుకున్న మహిళలకు ఓ నేత వివరించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో అక్కడికి లబ్ధిదారులు వెళ్లారని తెలుసుకున్నా పోలీసులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు.. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు వద్దకు చేరుకోగా అప్పటికే మహిళలు వెళ్లిపోయినట్లు సమాచారం.

పోలీసుల కౌన్సెలింగ్

హసన్‌పర్తి: కేయూ పరిధిలోని పలు ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు పోలీసులు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు బెల్ట్‌షాపులు నిర్వహించొద్దని చెప్పారు. ఒకవేళ బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే శిక్ష తప్పదని ఎస్సై రాజ్‌కుమార్ హెచ్చరించారు. బెల్ట్‌షాపులు నిర్వహించబోమని వారితో లిఖితపూర్వకంగా పత్రాలు తీసుకున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

వరంగల్ క్రైం: ఎనిమిది నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ విభాగం (ఏహెచ్‌టీయూ) పోలీసులు తిరిగి తన కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. బాలుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాం, ఎస్సైలు ఫసీ, మల్లేశం, ఏఎస్సై భాగ్యలక్ష్మి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను డీసీపీ అభినందించారు.

మూడోసారి ధర్మారెడ్డి గెలుపు ఖాయం



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఆత్మకూరు: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ యూత్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అమలు చేసిన పథకాలను యూత్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి గెలిచిన అనంతరం చేయబోయే అభివృద్ధి, అమలు చేసే సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం మధుకర్, నాయకులు పాపని రవీందర్, వంగాల భగవాన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధాలు వద్దు



నిరసన ప్రదర్శనలో ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధాలు వద్దని, ప్రపంచశాంతి కావాలని పౌర ప్రజా సంఘాల ఐక్య వేదిక కో ఆర్డినేటర్ నల్లెల రాజయ్య కోరారు. పాలస్తీనా గాజాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ హనుమకొండలో పౌర ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం సాయంత్రం ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ఇజ్రాయిల్ – పాలస్తీనా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న బీభత్స యుద్ధాన్ని మాటల్లో చెప్పలేమని ఆందోళన వ్యక్తం చేశారు. దురాక్రమణ నీతిలో ఇజ్రాయిల్ ఎంతో శక్తివంతంగా మారి పాలస్తీనా దేశంలో నిత్యం వేలాది మంది చిన్నారులను చంపేయడం, భవనాలను కూల్చేయడం దారుణమని వాపోయారు. ఇజ్రాయిల్ చేస్తున్నది యుద్ధం కాదని దురాక్రమణ అని అన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో 'ఓటు'పై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న మహిళలు

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శంభునిపేట ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఓటు ఆవశ్యకతపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు విలువ గురించి జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్రాజెక్ట్ అధికారి కోలా రాజేష్‌కుమార్ వివరించారు. ఓటరు పోలింగ్ స్టేషన్‌ను ఏ విధంగా తెలుసుకోవాలో, ఓటును ఏ విధంగా వేయాలో వీడియో, ఆడియో ద్వారా అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకుంటామని సమావేశానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీడీపీఓ విశ్వజ, సీఓ ప్రవీణ్, ఆర్‌పీలు, ఓబీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

హన్మకొండ: బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ఆరోపించారు. చిన్నాల యశ్వంత్ యాదవ్ అధ్యక్షతన హనుమకొండ సుబేదారిలో బీసీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీసీలకు అన్ని పార్టీల కంటే అతి తక్కువ స్థానాలను కేటాయించడమే కాకుండా, బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు చేయడం లేదని తూర్పారబట్టారు. బీసీల పట్ల తమ వైఖరిని కాంగ్రెస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు ధారబోయిన సతీష్, రమేష్, నరేందర్, జితేందర్ పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం



కమలాపూర్: పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించి పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఈ సంఘటన మండలంలోని శనిగరంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన శనిగరపు అర్చన (22)కు పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించగా సిబ్బంది హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తరలిస్తుండగా అంబాల శివారులో అర్చనకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఆర్‌సీపీ డాక్టర్ గోపి సూచన, సలహాలతో 108 సిబ్బంది సురక్షితంగా డెలివరీ చేశారు. అర్చనకు పండంటి మగ బిడ్డ జన్మించాడు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ మండ కేదారి తెలిపారు. కాగా అత్యవసర సమయంలో తక్షణమే స్పందించి సురక్షితంగా ప్రసవం చేసిన 108 సిబ్బందికి అర్చన కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి



వెంకటరమణ(ఫైల్)

కమలాపూర్: రోడ్డు ప్రమాదంలో కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ బూర వెంకటరమణ(42) మృతి చెందాడు. వెంకటరమణ బైక్ రిపేరింగ్‌తో పాటు ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నాడు. శుక్రవారం బైక్‌పై కమలాపూర్ నుంచి కనిపర్తి వైపు వెళ్తుండగా.. దేశరాజుపల్లి మూలమలుపు వద్దకు వెళ్లగానే.. కనిపర్తి వైపు నుంచి కమలాపూర్‌కు వస్తున్న లారీని డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి వెంకటరమణ బైక్‌ను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో వెంకటరమణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా కమలాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే వెంకటరమణ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బి.సంజీవ్ తెలిపారు.

ఐక్య పోరాటాలతోనే రిజర్వేషన్ల సాధన

● రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న పెరుమాండ్ల వెంకటేశ్వర్లు

పరకాల: ఐక్య పోరాటంతోనే రాజకీయ, సామాజిక రిజర్వేషన్లను సాధించుకోవచ్చని తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన మండలస్థాయి మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆ సమితి సీనియర్ నాయకుడు దుబాసి వెంకటస్వామి అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మాలల ఓట్లు కీలకమన్నారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు మాలలను గుర్తించి హక్కుల అమలు, సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తామంతా ఏకమై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలవాలంటే తమ ఓట్లు కీలకమనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాలలు ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. ఐక్యంగా హక్కుల సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుబాసి కృష్ణప్రసాద్, శ్రీరాముల పైడి, కొనమాల పాపయ్య, బోగం శ్రీనివాస్, పంజాల సారంగపాణి, పసుల శంకర్, డాక్టర్ సంజీవ్, దండ్రె నారయణ, దండ్రె సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనవిజ్ఞాన వేదిక ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ప్రముఖులు

ధర్మసాగర్: జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ నగరంలోని మల్లికా మెన్షన్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆచార్య కాశీనాథ్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి పరికిపండ్ల వేణు, ధర్మప్రకాష్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. శాస్త్రీయ సమాజ నిర్మాణ కోసం జేవీవీని విస్తృత పరిచి ప్రజా బాహుల్యంలోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించాలని వక్తలు, సీనియర్ కార్యకర్తలు సూచించారు. విశ్రాంత అటవీశాఖ అధికారి పురుషోత్తం, ఆచార్యులు ఆంజనేయులు, రవికుమార్, హరిప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకరచారి, అధ్యాపకుడు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు అల్వాల నాగేశ్వర్‌రావు, వెలిదండి సుమలత, సీనియర్ న్యాయవాది రమేష్‌బాబు, మెరుగైన సమాజం కోసం విద్యా, ఆరోగ్యం, శాస్త్ర ప్రచారం, మహిళాభ్యుదయం గూర్చి నిర్దిష్టంగా కార్యక్రమాలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. హనుమకొండ జిల్లాలోని అన్ని మండలాల కార్యకర్తలతో పాటు ములుగు, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు. వేదిక సభ్యత్వాన్ని డిసెంబర్ 31 లోపు పూర్తి చేయాలని, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముఖి సైన్స్ పోటీలను పాఠశాల స్థాయి డిసెంబర్ 13న, మండల స్థాయి డిసెంబర్ 20, జిల్లా స్థాయి డిసెంబర్ 28న నిర్వహించాలని తీర్మానించారు. నవంబర్ 07వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నాలుగు నెలల పాటు కార్యాచరణ చేయాలని వెల్లడించారు. అలాగే ఎన్నికల్లో పాల్గొంటున్న వివిధ పార్టీల అభ్యర్థులు, ప్రముఖులతో మెరుగైన సమాజం కోసం ప్రజల ప్రగతి కోసం చేయాల్సిన ప్రణాళికను రూపొందించేందుకు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సునీత, సరళ, సుమతి, మంజుల, సాంస్కృతిక బృందం సభ్యులు ఎర్రన్న, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను చూసే చేరికలు

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



పార్టీలో చేరుతున్న నాయకులు

శాయంపేట : సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. మండలానికి చెందిన వైసీపీ మండల అధ్యక్షుడు అల్లె అర్జున్, ఎంసీపీఐ జిల్లా నాయకుడు పింగిళి రాజిరెడ్డి, ప్రగతిసింగారం గ్రామ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు పెంట రాజన్న, యూనియన్ సభ్యులు పిట్టల రఘుపతి, సుధాకర్, మాదారపు సమ్మయ్య, మోరే రవి, మిరియాల తిరుపతి, బిల్లా సతీష్, సందీప్‌రెడ్డి, తిరుపతి, సతీష్, శ్రీకాంత్, అనిల్, అఖిల్, తిరుపతిలతోపాటు మరో పది మంది శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడబోతుందని, భూపాలపల్లిలో భారీ మెజారిటీ రాబోతుందని రమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతకు తిరపతిరెడ్డి, సర్పంచ్ సుమలతరమణారెడ్డి, నాయకులు దూలం నాగరాజు, మామిడి అశోక్ పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీడీ శ్రీనివాస్

ఎల్కతుర్తి: మండలంలోని రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించి మోసపోవద్దని ఏపీడీ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు సూరారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యంలో తాలు, చెత్త లేకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యంలో 17 శాతం తేమ ఉండేలా ఆరబెట్టాలన్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నిసంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఏగ్రేడ్ రకానికి రూ.2203, కామన్ రకానికి రూ.2183 మద్దతు ధర చెల్లిస్తున్నామని అన్నారు. డీపీఎం ప్రకాష్, ఏఓ రాజ్‌కుమార్, ఏపీఎం రవీందర్, ఏఈఓలు తిరుపతి, కల్యాణి, సీసీ రవీందర్, సీఏ కవిత, రైతులు పాల్గొన్నారు.

అమెరికాలో తెలుగు సాంస్కృతిక ప్రదర్శనలు



కాలిఫోర్నియాలో తెలుగు రాష్ట్రాల కళాకారులు

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కానిపర్తికి చెందిన గాయకురాలు మామిండ్ల మౌనిక యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులతో కలిసి అమెరికాలోని దక్షిణ కాలిఫోర్నియాలో తెలుగు సంఘం (టాస్క్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తెలుగు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. మౌనిక యాదవ్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు భిక్షునాయక్, ఝాన్సీ, లావణ్య, రమణ, సుజాత, రాజు, ఫ్రాన్సిస్, వాజిద్, మనోహర్, రాజ్‌కుమార్, షరీఫ్, రమేష్ తమ కళాప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.